ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఎన్నాళ్లీ వేధింపులు ?

- కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు దీక్షా శిబిరంపై ఆంక్షలు
- టెంట్ వేయకుండా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పోలీసుల అడ్డగింత
- మండిపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని బిజెపి మార్గదర్శకత్వంలో నడుస్తూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంతరం కార్మికులను వేధిస్తోంది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాలుగున్నరేళ్ల నుంచి పోరాడుతున్న వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉక్కు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ, పోలీస్ బలగాలను ఉసిగొల్పుతూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తాజాగా కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరంపై ఆంక్షలు పెడుతూ పోలీసులను పురమాయించింది. టెంట్ వేసుకోకుండా అడ్డుకుంది. 'ఈ భూమిలోకి ప్రవేశించవద్దు' అంటూ ఉక్కు యాజమాన్యం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అసలేం జరిగింది ?

కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నాలుగున్నరేళ్లుగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన దీక్షా శిబిరం నడుస్తోంది. ఈ నెల 12న గాలి వానకు టెంట్ కూలిపోయింది. దీన్ని పునర్నిర్మించుకునేందుకు కార్మికులు సిద్ధమవుతుండగా స్టీల్ యాజమాన్యం దువ్వాడ పోలీసులను పంపించి 'ఇది స్టీల్‌ప్లాంట్ భూమి. ఇక్కడ టెంట్‌లు వేయడానికి వీల్లేదు' అంటూ కార్మికులను బెదిరించింది. టెంట్ వేయకుండా అడ్డగించింది. వాస్తవానికి నాలుగున్నరేళ్లుగా శాంతియుతంగా ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయమూ కలగజేయకుండా, ప్లాంట్ ఉత్పత్తికి సైతం ఆటంకం లేకుండా కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఈ ఉద్యమం దేశ ప్రభుత్వ రంగ సంస్థల చరిత్రలోనే ఒక రికార్డుగా నిలుస్తోంది. కేంద్రం మిగతా 2లో..



వర్షంలోనే సాగుతున్న ప్రయాణాలు

వర్షంతో ఊరట

- చురుగ్గా రుతుపవనాలు
- ఉమ్మడి విశాఖలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కొన్ని వారాలుగా తీవ్ర ఎండలు, ఉక్కబోతతో సతమతవుతున్న ఉమ్మడి విశాఖ వాసులకు సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షం ఊరటనిచ్చింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో వర్షపు జల్లులు కురిసి జనం సేదతీరారు. విశాఖలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 35 నుంచి 28 డిగ్రీలకు తగ్గడం విశేషం.

రాగల మూడు రోజులూ పలుచోట్ల వర్షాలు

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, సరిహద్దు వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 5.8 - 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉండడంతో రాగల మూడు రోజులూ వర్షాలు పలుచోట్ల కురిసే అవకాశాలున్నాయని అమరావతి, విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో మిగతా 2లో..

అరజన్ ఫార్మాలో ప్రమాదం

వార్త మెయిన్‌లో..

కులం పేరుతో తిట్టినవారిని అరెస్ట్ చేయాలి

వార్త 2లో..

సచివాలయ ఎఎన్‌ఎమ్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలి

వార్త 4లో..



విశాఖ నగరంలో సాగుతున్న యువత పోరు నిరసన ర్యాలీ

ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి సంగతేంటి ?

ఉమ్మడి విశాఖలో వైసిపి 'యువత పోరు' నిరసనలు

వార్త 8లో..

గ్రావెల్ దందా !

- చందకలో కొండను మాయం చేస్తున్న మట్టి మాఫియా
- రాత్రికి రాత్రే ఖాళీ అవుతున్న కొండలు

ప్రజాశక్తి-ఆనందపురం :

ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధి జగ్గరాజుపాలెం సర్వే నంబరు 4లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ కాలనీల అభివృద్ధి పేరుతో కొందరు ఆక్రమణదారులు మట్టి దందాకు పాల్పడుతున్నారు. అనుమతుల పేరుతో అసలు వాహనాలు కాకుండా వేరే వాహనాల్లో గ్రావెల్ తరలింపు కొనసాగుతోంది. పొంతనలేని సమాధానాలిస్తూ కొండను తవ్వుతూ మట్టిని రాత్రింబవళ్లు తరలిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 2 వేల లారీలు మట్టిని తరలించి ప్రయివేటు స్థలాల్లో డంపింగ్ చేస్తూ లక్షల గడిస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలున్నాయి. ఈ దందాపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు అక్కడ ఉన్న జెసిబీ లారీ, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వారిపై కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసే ఈ చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కొండలు మాయమవుతున్నా అధికార యంత్రాంగం స్పందించడంలో జాప్యం చూపుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొండ ప్రాంతంలో సాగుతున్న తవ్వకాలు



గ్రావెల్ తరలింపునకు సిద్ధంగా ఉన్న లారీ

మొదటి పేజీ తరువాయి..

ఎన్నాళ్లీ వేధింపులు ?

తన ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమం ఆగదని ఉక్కు కార్మిక సంఘాలు పదేపదే చెబుతున్నాయి. కేంద్రంపై పోరాడేందుకు తామూ వెంటుంటామని 2024 ఎన్నికల సందర్భంగా టిడిపి అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నాడు మాటిచ్చి అధికారం చేపట్టాక ఆ మాట తప్పారు. వికృత చర్యలకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పాల్పడుతున్నా ఆ ఇద్దరు నేతలూ కనీసం నోరుమెదపకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాజువాక ఎంఎల్‌ఎ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సైతం ఈ చర్యలపై ఎలాంటి ప్రకటనా చేయడంగానీ, కార్మికులవైపు కన్నెత్తి చూడడంగానీ చేయకపోవడం చూస్తే యాజమాన్యానికి టిడిపి కూటమి ప్రభుత్వం ఎలా వత్తాసు పలుకుతుందో స్పష్టమవుతోంది. టెంట్ వేయనియ్యకపోవడంపై విశాఖ నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి పోరాట కమిటీ నేతలు సిహెచ్.నరసింగరావు, మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ ఫిర్యాదు చేశారు. తక్షణం దీక్షా శిబిరం టెంట్ వేసుకునేందుకు అనుమతివ్వాలని వారు కోరుతున్నారు.

వర్షంతో ఊరట

ఉత్తరాంధ్రలో పలుచోట్ల గాలులు వీచే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమలోనూ బలమైన గాలులు వీయనున్నాయి. అక్కడక్కడా భారీ వర్షాలు కురియనున్నాయి. చేపల వేటకు సముద్రంపైకి వెళ్లే మత్స్యకారులకు ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో రాగల రెండు రోజులూ గాలులు వీచే పరిస్థితి ఉండడం, అక్కడక్కడా తీరం వెంబడి భారీ వర్షాలకు ఆస్కారం ఉండడంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాఖ నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజల విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై వాతావరణ పరిస్థితులను బట్టి తగిన ఏర్పాట్లు చేయాలని వాతావరణ శాఖ చెబుతోంది. నగరంలో పలుచోట్ల మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉండడం, జివిఎంసి అధికారులు వీటిపై సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, కాలువలు నిండి పొంగి పొర్లడం, రోడ్లపైకి రావడం వంటి పరిస్థితులతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని పలువురు కోరుతున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, తద్వారా ఉన్నత విద్యలో నైపుణ్యాన్ని సంపాదించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలో సేక్రేడ్‌హాట్స్, జూబ్లీమిషన్ స్కూళ్లలో సోమవారం కంప్యూటర్ ల్యాబ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదంత కంపెనీ దక్షిణ నియోజవర్గానికి అనేక విధాలుగా తమ సహకారం అందిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. దేశవ్యాప్తంగా వేదంత కంపెనీ ద్వారా పలువురు సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా, అనేక సదుపాయాలు కల్పించడం గర్వకారణంగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూ.10 లక్షల విలువైన లాప్‌టాప్‌లతో పాటు, రూ.5 లక్షలతో నైపుణ్యం గల ఉపాధ్యాయులను అందజేసిన వేదంత కంపెనీకి, ఈ సందర్భంగా స్థానిక యాజమాన్యంతో పాటు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు స్థానిక టిడిపి, జనసేన నాయకులు ఆంథోనీ శేఖర్, మధుబాబు, సంజీవరావు, వేదాంత సిఇఒ సతీష్, సిఎస్‌ఆర్ విజి సిబి లక్ష్మి పాల్గొన్నారు.

బర్దన్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి మండలం చినముషిడివాడ జివిఎంసి 97వ వార్డ్ బర్దన్‌నగర్ కాలనీలో విద్యుత్తు సదుపాయంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ మాట్లాడుతూ బర్దన్‌నగర్ కాలనీలో 2014 నుంచి 100 కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. విద్యుత్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు పి.చంద్రశేఖర్ ,కె.సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సిఎన్.క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, వనజాక్షి, వై.త్రినాథ్ పాల్గొన్నారు.

రామకృష్ణ థియేటర్‌ను కూల్చివేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బౌరాడా రోడ్‌లోని రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్‌పై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో జివిఎంసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బివి రామ్ ఆరోపించారు. సోమవారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామ్ మీడియాతో మాట్లాడుతూ రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్ వారసుడు వేగి రాధాకృష్ణతో కలిసి హైకోర్టు తీర్పును అమలు చేయాలని మేయర్‌ను కోరడం జరిగిందన్నారు.రామకష్ణ థియేటర్‌పై హైకోర్టు తీర్పు వచ్చి ఏడాదిన్నరకాలం గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. శిధిలావస్థలో ఉన్న రామకృష్ణ థియేటర్‌ను కూల్చివేసి, న్యాయంగా వేగి రాధాకృష్ణ కి రావాల్సిన ప్రాపర్టీని అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పు చెప్పిందన్నారు. ప్రస్తుతం అది ఆక్రమణలో ఉందన్నారు.

కులం పేరుతో తిట్టినవారిని అరెస్ట్ చేయాలి



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు, బాధితులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దొండపర్తి జంక్షన్ సమీపంలో మిరాజ్ సినిమాస్‌లో పనిచేస్తున్న గిరిజన మహిళలను కులం పేరుతో దూషించి, అవమానించి, వారిని ఉద్యోగం నుంచి తొలగించిన డ్యూటీ మేనేజర్లు జ్యోతి, వెంకటేష్‌లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు.

సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలగించిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే మిరాజ్ సినిమాస్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు.

పోలీసుల వైఫల్యం కప్పిపుచ్చేందుకే..

జగన్ పర్యటనపై దుష్ప్రచారం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలో పోలీసుల వైఫల్యం కనిపించడమే కాకుండా తర్వాత పరిణామాలు చూస్తుంటే రాజకీయాలు ఎలా దిగజారిపోయాయో అర్ధమవుతోందని వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. బీచ్‌రోడ్డులోని బొత్స క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగమయ్య అనే వైసిపి కార్యకర్త జగన్ వాహనం కింద పడలేదని, వేరే వాహనం వల్ల ప్రమాదం జరిగిందని ఎస్పీనే తెలిపారని, ప్రమాదానికి కారణమైన వాహనదారులను పిలిచి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించిన అధికారులు మళ్లీ ఎందుకు మాట మార్చారని బొత్స నిలదీశారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు మూడేళ్ల వరకు టీడీపీ రోడ్డు ఎక్కలేకపోయిందని, మరి ఇప్పుడు ఎందుకు ఇంత వ్యతిరేకత వచ్చిందని ప్రశ్నించారు.కాన్వాయ్, ఎస్కార్ట్ పర్మిషన్ ఇచ్చినప్పుడు రోప్ పార్టీ ఏమైపోయిందని, ఎక్కడ ఉంది మీ పోలీస్ వ్యవస్థ అని నిలదీశారు. పీ4 పబ్లిసిటీ మాత్రమే అని, యోగా దినోత్సవం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం కరెక్టేనా అని బొత్స మండిపడ్డారు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తీసుకుని వెళ్లకుండా ఎస్పై రాజశేఖర్ అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. యోగాంధ్ర గిన్నీస్ వరల్డ్ రికార్డ్ బోగస్ అని, 2 లక్షల 40 వేల మంది హాజరయ్యారని అధికారులు చెబితే, మూడు లక్షలు దాటిందని గిన్నీస్‌బుక్ వాళ్ళు చెప్పారని, దీంట్లో ఏది నిజం అని బొత్స ప్రశ్నించారు.

జగన్నాథ రథయాత్రకు మేయర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జగన్నాథ స్వామి వారి కళ్యాణం, రథయాత్రకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు శ్రీ జగన్నాథ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి టి.రాజగోపాల్‌రెడ్డి ఆహ్వాన పత్రికను జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో సోమవారం అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జూన్ 27న నిర్వహించే జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని జూన్ 27 నుండి జూలై 7 వరకు రథయాత్ర జరుగుతుందని కార్యక్రమానికి వేలాదిగా భక్తులు వస్తారని ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారికి మేయర్ సూచించారు.

సమాచార శాఖ డిడిగా సదారావు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం రెగ్యులర్ డిడిగా కె.సదారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు డిడిగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్టణం ఉపసంచాలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇప్పటివరకూ ఇన్‌చార్జి డిడిగా వ్యవహరించిన డి.రమేశ్ నుంచి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సమాచారపౌర సంబంధాల శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్‌ను మురళీనగర్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. సదారావు నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఇన్‌చార్జి డిడిగా వ్యవహరించిన రమేశ్, ఎస్ఐసి ఎడిగా తన పూర్వ విధులకు వెళ్లిపోయారు.

చిత్తూరులోని కరెంట్ మీటర్లకు...

ఆనందపురం రైతు ఆధార్ లింక్



ఫిర్యాదు చేసిన బొత్స రాము

- సంక్షేమ పథకాలకు అనర్హత

- పిల్లలు చదువుతున్నా పడని 'తల్లికి వందనం'

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం, శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన రైతు బొత్స రాము కుటుంబం ఆధార్ కార్డు లింకింగ్‌లో జరిగిన సాంకేతిక పొరపాటు వల్ల సంక్షేమ పథకాలకు దూరమైంది. బొత్స రాము ఆధార్ నంబర్ 4063 7067 6096, ఆయన భార్య బొత్స లక్ష్మి ఆధార్ నంబర్ 3450 0158 0328కు చిత్తూరు జిల్లాకు చెందిన రెండు ఎస్పీడీసీఎల్ కరెంట్ మీటర్లు లింక్ అయినట్లు గుర్తించారు. ఆయా మీటర్ నంబర్లు 3421552000642-55, 3421552000641-56గా ఉన్నాయి. ఈ లింకింగ్ కారణంగా బొత్స రాము కుటుంబానికి 'తల్లికి వందనం', పింఛన్, తదితర సంక్షేమ పథకాలు అందడంలేదు. 'ఇది కేవలం సాంకేతిక లోపంగా కనిపించినా, మాకు ప్రభుత్వ సాయం రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం' అని బొత్స రాము వాపోతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు రాము ఫిర్యాదు చేసి, తన ఆధార్ కార్డుకు లింకైన చిత్తూరు కరెంట్ మీటర్లను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం పథకానికి అనేకమంది లబ్ధిదారులు ఇలాంటి సమస్యలతో అనర్హులవుతున్నాయని, మండల స్థాయిలోనే పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గొట్టిపల్లి భూ వివాదంపై వినతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం, గొట్టిపల్లి గ్రామంలో భూవివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. రెవెన్యూ సర్వే నెంబర్ 102-3లోని భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతుండగా, అసలు భూ యజమానులు తమ హక్కును రక్షించుకునేందుకు పోరాడుతున్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. చందక గ్రామానికి చెందిన దొంతల వీరప్ప, అప్పలనాయుడు, తమ్మన్న, సిరిపురపు రామారావు, సూరీడు తదితరులు సర్వే నెంబరు 102/3లో భూమిని దశాబ్దాలుగా సాగుచేస్తూ పన్నులు చెల్లిస్తూ వస్తున్నామని, 1969లో తీసుకున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ఆధారంగా తమకు భూమిపై పూర్తి హక్కు ఉందని వారు పేర్కొన్నారు. 2016లో కొంతమంది తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ భూమిపై హక్కులు కలిగి ఉన్నట్లు కోర్టు నుండి తాత్కాలికంగా స్టే పొందినట్లు పేర్కొన్నారు. అసలైన యజమానులు కోర్టులో కేసులు వేయగా, ప్రస్తుతం విచారణలో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఇటీవల ఎటువంటి నోటీసులు లేకుండా, వారి డాక్యుమెంట్లు పరిశీలించకుండానే కొన్ని భాగాలకు విడిగా ఎల్‌పిఎంలు (ల్యాండ్ ప్యార్సెల్ మ్యాప్) మంజూరు చేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సర్వే నెంబర్ 102-3లో ఉన్న శ్మశాన వాటిక, చెరువు వంటి పబ్లిక్ ప్రాపర్టీలను కూడా అధికారికంగా గుర్తించకుండా మంజూరు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికే ఇచ్చిన విడిపడిన ఎల్‌పిఎంలను రద్దు చేయాలని, మొత్తం 9.81 ఎకరాల భూమిని కోర్టు తీర్పు వచ్చేవరకు వివాదాస్పదంలో ఉంచాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-మధురవాడ : యోగాంధ్రను విజయవంతం చేయడంలో ఎంతో శ్రమించిన 8వ వార్డు సచివాలయ సిబ్బందిని, ఆర్‌పిలను వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, వార్డు జనసేన అధ్యక్షులు శాఖరి శ్రీనుబాబు సత్కరించారు. ప్రపంచం మొత్తం విశాఖపట్నం వైపు చూడాలి అనే గొప్ప కార్యక్రమానికి అహర్నిశలు కష్టపడిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఒఎస్ సేవలు ఆదర్శనీయం

ఎంపీ శ్రీభరత్



జ్ఞాపికలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంపి శ్రీభరత్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కొనియాడారు. స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ప్రాంగణంలో చిల్డ్రన్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. తొలుత చిల్డ్రన్స్ విలేజ్ వ్యవస్థాపకులు హెర్మన్ మైనర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీ భరత్ హాజరై మాట్లాడుతూ, అనాథ పిల్లల సంరక్షణకు, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న సంస్థ సేవలు ఎనలేనివని ప్రశంసించారు. తల్లిదండ్రులు లేని లోటును తీర్చడం ఒకింత కష్టమే అయినప్పటికీ ఆచరణలో ఇక్కడ పిల్లల పట్ల ఎంతో ప్రేమానురాగాలు కనబరుస్తుండడం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు విశాఖ డిఎల్ఎస్ఎ కార్యదర్శి సన్యాసినాయుడు మాట్లాడుతూ, సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. చదువుకుని ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా అందుకు కారణమైన సంస్థను మరువరాదని విద్యార్థులకు నొక్కి చెప్పారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ సి.మణికండన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఒఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం ప్రాజెక్ట్ ఇంచార్జి కె.బంగార్రాజు, యూత్ కో-వర్కర్ జాన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎస్టీ విభాగం నాయకులు చెట్టి అశోక్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్ చేతుల మీదుగా టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

డేటా సైన్స్‌లో కృత్రిమ మేధపై ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : డేటా సైన్స్, కంప్యూటర్ విజన్‌లలో కృత్రిమ మేధ ఆవిష్కరణలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్ఐటి వరంగల్, కేంద్రప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)ను సోమవారం నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా ఎన్ఐటి వరంగల్ మిషన్ లెర్నింగ్ ఆల్గరిథమ్స్ నిపుణుడు ప్రొఫెసర్ జె.రవికుమార్ హాజరై మాట్లాడుతూ, డేటా ఆధారిత సాంకేతిక విప్లవంలో నిపుణులైన మానవ వనరులను తయారుచేయడానికి ఎఐఎమ్ఎల్ వంటి అంశాలను సిలబస్‌లో చేర్చాలని సూచించారు. కృత్రిమ మేధ ఆధారంగా భవిష్యత్తులో సాంకేతిక ప్రగతి సాధించవచ్చని పేర్కొన్నారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయంతో కృత్రిమ మేధపై సంయుక్త అధ్యయనాలు చేపట్టాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, సిఎస్ఇ కోర్సుల డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్, సిఎస్ఇ విభాగం అధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, కృత్రిమ మేధ, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.నవీన్ కుమార్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజమణి ప్రసంగించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో జనరేటివ్ ఎఐ, కంప్యూటర్ విజన్‌లో కృత్రిమ మేధ ఆవిష్కరణలు, ఎక్స్‌ప్లైనబుల్ ఎఐ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పలు ప్రజా సమస్యలపై స్థానిక వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం వివిధ శాఖల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వివిధ కారణాలతో వేలి ముద్రలు పడని వారికి రేషన్ అందివ్వాలని, రేషన్ దుకాణాల్లో సరుకుల పట్టికలు ఉంచాలని, ఫుడ్ కమిటీల్లో తమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ మనోరంజనికి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. తల్లికి వందనం అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఎంపిడిఒ కెవి.నరసింహారావుకు, జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు వినతి పత్రాలు అందజేశారు. జమ్మి చెరువు పార్కు, చిల్డ్రన్ పార్కుల్లో వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. వినతి పత్రాలు అందజేసిన వారిలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సన్యాసినాయుడు, పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ, పలువురు సభ్యులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో ఉక్కు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు టౌన్ షిప్ సెక్టార్-4లో ఇంట్లో నిద్రిస్తున్న ఉద్యోగి తాగరంపూడి శ్రీనివాస్ (58) పాము కాటుతో మృతిచెందారు. ఇంట్లో నిద్రిస్తున్న శ్రీనివాస్‌ను తెల్లవారి 4.15 గంటలకు పాము కుట్టింది. ఆయన వెంటనే ఉక్కు జనరల్ ఆసుపత్రికి వెళ్లారు. డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో మాట్లాడుతుండగానే శ్రీనివాస్ కుప్పకూలి పోయాడు. వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయినట్టు నిర్ధారించారు. పాము కాటుకు గురైన శ్రీనివాస్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

- ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి లంకెలపాలెంలో తాళాలు వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగలు బీరువాలోని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం రామాలయం వీధిలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకటలక్ష్మి తన పెద్ద కుమార్తెతో కలిసి పెందుర్తి మండలంలోని బంధువుల ఇంటికి శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం ఆమె బంధువు సూరిశెట్టి అప్పలరాజు ఇంటి మెయిన్ డోర్, బెడ్‌రూమ్ డోర్ తాళాలు తీసి ఉన్నట్లు గమనించి వెంకటలక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే తన ఇంటికి వచ్చి పరిశీలించగా, బెడ్‌రూంలో దాచిన తాళాలను తీసుకుని వాటితో బీరువా ఓపెన్ చేసి, లోపలి లాకర్‌లో ఉన్న సుమారు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. దీనిపై ఆదివారం పరవాడ పోలీసులకు బాధితరాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు క్లూస్ టీం సంఘటనా స్థలానికి వచ్చి ఫింగర్ ప్రింట్లు సేకరించింది. తలుపులు, తాళాలపై బలవంతపు ప్రవేశం జరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని, ఈ ఘటన అనుమానాస్పదంగా ఉన్నందున అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని సిఐ మల్లికార్జునరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

మెడికవర్‌లో 30 బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో నెలకొల్పిన అత్యాధునిక బిఎంటి యూనిట్ ప్రారంభమైన ఒక్క సంవత్సరంలో 30 బోన్ మేరో ట్రాన్స్ ప్లాంట్లను విజయవంతంగా నిర్వహించి రోగుల ప్రాణాలు కాపాడి రికార్డు సాధించినట్లు మెడికల్ ఆంకాలజీ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ రావత్ దేవ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని సోమవారం ఆరిలోవ మెడికవర్ కేన్సర్ అస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ఇలాంటి ట్రాన్స్‌ప్లాంట్లు కోసం రోగులు వెల్లూరు లేదా ఎఐఐఎమ్ఎస్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఇటువంటి కేసులకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ పరిసర రాష్ట్రాల నుండి వచ్చే రోగులకు ఈ ఆస్పత్రి నూతన ఆశగా నిలుస్తోందన్నారు. లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి కేన్సర్లకు, ల్యూకేమియా, బోన్ మారో ఫెయిల్యూర్స్‌కు, హై-రెస్క్ హాఫ్లో ఐడెంటికల్ ట్రాన్స్ ప్లాంట్లు, అనీమియా వంటి అరుదైన వ్యాధులకు మెడికవర్ చికిత్స అందిస్తుందని తెలిపారు. పేదలకు ప్రభుత్వ పథకాలు, ఎన్జీవోల సాయంతో ట్రాన్స్ ప్లాంట్లు అందిస్తున్నట్లు వివరించారు. ధనలేమి కారణంగా జీవనావకాశాన్ని కోల్పోవద్దనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహిత్య, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆచార్య పాల్గొన్నారు.

7 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సమస్యలపై జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు 7 అర్జీలు అందాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి 3, యుసిడి విభాగానికి 2, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు అయ్యప్పనాయుడు తెలిపారు.

విశాఖ విమల విద్యాలయం ప్రారంభానికి అంగీకారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని వెంటనే ప్రారంభించడానికి యాజమాన్యం అంగీకారం తెలిపిందని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. గత పది రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో సోమవారం అడ్మిన్ బిల్డింగ్‌లో చర్చలు జరిగాయని వెల్లడించారు. ఈ చర్చల్లో స్టీల్ ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులు విశాఖ విమల విద్యాలయం నిర్వాహకులు, కార్పొరేటర్ బి.గంగారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నట్లు తెలిపారు. పాఠశాలను కొనసాగించడానికి అవసరమైన అనుమతుల కోసం జిల్లా విద్యాశాఖ అధికారికి వెంటనే ఉత్తరం రాయటానికి స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. మరో రెండు రోజుల్లో పాఠశాల ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన మినిట్స్ పేపర్ మీద సంతకాలు జరిగినట్లు తెలిపారు. నిధులు లేవని విశాఖ విమల విద్యాలయాన్ని మూసి వేయటం దారుణమన్నారు. విశాఖ విమల విద్యాలయం, కేంద్రీయ విద్యాలయాలకు నిధులు ఆపు చేయాలని ఆదేశించడం సరైన చర్య కాదన్నారు. వెంటనే పాఠశాలను కొనసాగించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పాఠశాలలను నడిపించే బాధ్యత విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీలపై ఉందని తెలిపారు.



మొక్కలు నాటుతున్న అధికారులు, పరిశ్రమ యజమానులు

ఆటోనగర్‌లో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -గాజువాక : ఎంఎస్ఎంఇ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన వాసవ, ఐలా సహకారంతో గాజువాక ఆటోనగర్-ఇ బ్లాక్ వద్ద సోమవారం పరిశ్రమ యజమానులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం స్వచ్ఛభారత్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ప్రభాకర్‌కుమార్, కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, మాజీ చైర్మన్ శేషగిరిరావు, కొల్లి ఈశ్వరరావు, సాంబశివరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.



చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సునీల్‌ను కలిసిన భెల్ గుర్తింపు యూనియన్ నాయకులు

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో భేటీ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ భెల్ యూనిట్‌కు వచ్చిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ డాక్టర్ కె.సునీల్‌కుమార్‌ను సంస్థ గుర్తింపు యూనియన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భెల్ హెచ్‌పివిపికి సంబంధించి పలు భద్రతాపరమైన అంశాలపై గుర్తింపు యూనియన్‌తో చర్చించారు. ఆయన్ను కలిసిన వారిలో బొండా బాబూరావు, సుబాకర్ సాహు, పివిఎన్.రాజు, కొల్లి దేముడు ఉన్నారు.

సమస్యలపై తహశీల్దార్‌కు విఆర్ఎల వినతి

ప్రజాశక్తి -పద్మనాభం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం పద్మనాభం తహశీల్దార్ ఆనందరావు వినతిపత్రం అందించారు. సమస్యలపై ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామని పేర్కొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఎలు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విశాఖ బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మల్కాపురం జోన్ 9వ మహాసభ 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. సభాధ్యక్షులు కె.పెంటారావు, చిన్నారావుల సమక్షంలో ముందుగా మరణించిన భవన నిర్మాణ కార్మికులకు సంతాపాన్ని తెలియజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ కార్యదర్శి ఎం.ఆదినారాయణ మూడేళ్ల కాలంలో జరిగిన కార్యకలాపాలు, ఉద్యమాలు, పోరాటాల గురించి వివరించారు. రాబోయే కాలంలో పోరాటాలు, ఉద్యమాలను నిర్దేశించారు. సభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు పునరుద్దించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ద్వారా రూ.3వేలు పింఛన్ మంజూరు చేయాలని, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్స్ పనిముట్లు ఉచితంగా ఇవ్వాలని పలు తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శ్రీను హాజరై మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులను వేరే పథకాలకు మళ్లించడంతో కార్మికులకు భవన సంక్షేమ పథకాలు అందటం లేదని అన్నారు. గతంలో కార్మికుడు మరణిస్తే సంక్షేమ బోర్డు నుండి రూ.2 లక్షలు, డెలివరీ అయితే రూ.20వేలు తదితర పలు సంక్షేమ పథకాలు అందేవని తెలిపారు. గతంలో ఉన్న జగన్ ప్రభుత్వం పూర్తిగా పథకాలను ఆపేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా వెంటనే జోక్యం చేసుకొని సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు.

సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు పనులు, ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత,ప్రస్తుత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను ఆదుకోకపోవడం దుర్మార్గమన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జులై 9న దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన జరిగే సమ్మెలో నిర్మాణ కార్మికులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జోన్ నాయకులు పి.పైడిరాజు మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాసభలో వక్తలు



భవన నిర్మాణ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పెంటారావు

నూతన కమిటీ ఎన్నిక

విశాఖ బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షులుగా కె.పెంటారావు, అధ్యక్షులుగా జె.రామునాయుడు, ఉపాధ్యక్షులుగా నీలయ్య, రాజారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా ఎస్.లక్ష్మణరావు, కోశాధికారిగా ఎల్.రాంబాబు కమిటీ సభ్యులుగా చిన్నారావు, మన్మధరావు, బి.రామకృష్ణ, సింహాద్రప్పుడు ఎన్నికయ్యారు. సిఐటియు నాయకులు ఎల్.కృష్ణ వందన సమర్పణ చేశారు.

రహదారి గుంతలమయం



గోతులమయంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి -ములగాడ : డాక్‌యార్డ్ ప్రాంతంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మరమ్మతుల కారణంగా కొన్నేళ్లుగా వాహన రాకపోకలు గొడౌన్స్ రహదారిలో సాగుతున్నాయి. ఎంతోమంది వాహనదారులు గాజువాక డిపో పక్కన ఉన్న ఐఎన్ఎస్ ఏకశిల మార్గంలో వెదురువానిపాలెం

ఇబ్బందుల్లో ప్రయాణికులు

రహదారి గుండా శ్రావణి షిప్పింగ్ పక్క నుంచి ప్రయాణిస్తున్నారు. శ్రావణి షిప్పింగ్ ప్రాంతంలో రోడ్డంతా గోతులు మాయంగా మారింది. రోజూ వందలాది మంది ప్రయాణించే ఈ రహదారిని ఎవరూ పట్టించుకోకపోవడంతో గుంతలు మరింత ఎక్కువవుతున్నాయి. వర్షం పడితే గుంతలన్నీ నీటితో నిండి రహదారి ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రావణి షిప్పింగ్ వాహనాలే ఈ రోడ్డులో ఎక్కువగా ప్రయాణిస్తున్నాయని, కనీసం ఆ యాజమాన్యమైనా ఈ రహదారిని వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ ఎఎన్ఎమ్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సచివాలయ ఎఎన్ఎమ్‌లు. మద్దతు తెలిపిన సిఐటియు నాయకులు మణి

ప్రజాశక్తి-సీతమ్మధార : గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని సచివాలయ ఎఎన్ఎంల రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దేవకి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎన్ఎంలు ప్రమోషన్లు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని జరిగాయని, ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రమోషన్ జరక్కుండా అధికారులు అలస్తత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 300 మంది ఎఎన్ఎంలకు ప్రమోషన్ ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు సరిగ్గా లేవని, ఆర్‌టిఐ వేరే సంఘాలు పెట్టారని, కులగణన జరగాలని, యోగాంధ్ర జనరల్ ప్రమోషన్స్ ఉన్నాయని షాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలలుగా డిఎంహెచ్ఒ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రమోషన్ ఆర్డర్లు ఇవ్వటం లేదన్నారు. ఇప్పటికైనా తమ ఆవేదన విని ప్రమోషన్ ఆర్డర్లు ఇవ్వాలని, లేకుంటే ధర్నా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో అధిక సంఖ్యలో ఎఎన్ఎంలు, సిఐటియు నాయకులు కె.మణి, మన్యం జిల్లా నాయకులు వి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వద్దు... బంగారు భవిష్యత్తే ముద్దు...

ప్రజాశక్తి-సీతమ్మధార : 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం' సందర్భాన్ని పురస్కరించుకొని 'మత్తు వద్దు.. బంగారు భవిష్యత్తే ముద్దు..' అన్న నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్‌ను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) డైరెక్టర్ ఈదర రవికిరణ్ తన ఛాంబర్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ సంస్థ విస్తృత ప్రచారం చేయడం ఆనందకరమని చెప్పారు. పిల్లల ప్రవర్తన గురించి తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వారికి అభిరుచి ఉన్న రంగంలో నైపుణ్యాలను వృద్ధి చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీన కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతరానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి, కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్, నాసిన్ సహాయ డైరెక్టర్ కెఆర్ఎస్ శంకర్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు ఎస్ఐలు సంతోష్, శివ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర మార్గాన్ని వదిలి నైతిక విలువలు కలిగిన జీవన మార్గాన్ని స్వీకరించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాల్లో పాల్గొనొద్దని, మత్తు వల్ల వ్యక్తిగతంగా, కుటుంబాల పరంగా ఎదురయ్యే నష్టాలను వివరించి, వారికి సానుకూలమైన మార్గదర్శనం చేశారు. అనంతరం ఎస్ఐలు సంతోష్, శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిపై పోలీస్‌శాఖ నిఘా ఉంచుతుందని, ఎవరైనా గొడవలు, దాడులు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లారీని ఢీకొన్న బస్సు

డ్రైవర్ సహా 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నర్సీపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ ఆర్టీసీ బస్సు సోమవారం విశాఖపట్నం వెళుతుంది. బయ్యవరం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ట్రాలీ లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు ఆ ట్రాలీ లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం నుజ్జయింది. ప్రమాదం జరిగే సమయానికి బస్సులో 34 మంది ప్రయాణికులు ఉన్నారు. లారీని ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో ప్రయాణికులు ఒకరిపై ఒకరు చల్లా చెదురుగా పడ్డారు. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ కె.కళ్యాణ్ కుమార్‌తోపాటు మరో ఏడుగురు నర్సీపట్నం చెర్లోపాలెంకు భార్య భర్తలు మాకిరెడ్డి నారాయణమూర్తి, రామలక్ష్మి, కె.సత్య నారాయణ, గెడ్డం పద్మ, నమ్మి రాజ్ కుమార్, పసుపులేటి ప్రభాకర్, పి.గంగాధర్‌కు గాయాలయ్యాయి. వీరిలో బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. బస్సు రోడ్డు మధ్యలో ఉండి పోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి, కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు పరిశీలించారు. క్షతగాత్రురాలు మాకిరెడ్డి రామలక్ష్మి నుండి వాంగ్మూలం తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి నాయుడు తెలిపారు.



బస్సును పక్కకు తీస్తున్న పోలీసులు, సహాయక సిబ్బంది



ఇంటర్వ్యూలు చేస్తున్న దివీస్ కంపెనీ ప్రతినిధులు

అయ్యన్న కళాశాలలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక అయ్యన్న డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ వారు ట్రైనీ సూపర్ వైజర్స్ ఉద్యోగాలు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ నియామాకాల కోసం సోమవారం బిఎస్‌సి కెమిస్ట్రీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివీస్ కంపెనీ హెచ్‌ఆర్‌లు కేశినేని శరత్, బ్రహ్మ చౌదరి ఇంటర్వ్యూలు చేశారు. సుమారు 20మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా వారిలో 12 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. వారికి ఆఫర్ లెటర్స్ త్వరలో ఇస్తామని హెచ్‌ఆర్‌లు చెప్పారు. ఎంపికైన వారిలో బాచిలర్స్‌కు ఉచిత వసతి, యూనిఫాం, అర్హులైన వారికి పీఎఫ్, ఇఎస్ఐ, భోజన ఖర్చులో రాయితీ ఉంటుందని తెలిపారు. కె.కోటపాడు ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అయ్యన్న విద్యా సంస్థలలో ఇంటర్వ్యూలు నిర్వహించడం పట్ల దివీస్ లేబరేటరీ వారికి అయ్యన్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఖాశీం కృతజ్ఞతలు తెలిపారు.

25న లక్కవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్కవరం గ్రామంలోఈనెల 25వ తేదీన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి కంటి సమస్యలు ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడంతో పాటు మందులు కూడా అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. తులసి కళ్యాణ మండపంలో జరుగు ఈ కార్యక్రమాన్ని కంటి వ్యాధిగ్రస్తులందరూ వినియోగించుకోవాలని కోరారు.



విద్యార్థుల తల్లిదండ్రులను కలిసిన ఉపాధ్యాయులు

జెడ్‌పి హైస్కూల్‌లో చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి-కశింకోట : మండలం నరసింగబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆ పాఠశాల ఉపాధ్యాయలు సుజాత, లక్ష్మి సోమవారం ప్రచారం చేశారు. బడి ఈడు పిల్లలను హైస్కూల్ జాయిన్ చేయాలని కోరారు. నేటి సమాజంలో చదువు చాలా అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న రాయతీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఎమ్‌జి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశం స్థానిక నూకాంబిక దేవాలయం సమీపంలో పిరమిడ్ ధ్యానమందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ స్కూల్ స్థాపించిన 1953 నుండి ఇప్పటి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులందరినీ సంఘం సభ్యులుగా చేర్చుకొని సేవలను విస్తృతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కెఎన్‌వి.సత్యనారాయణ, కోశాధికారి పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శి దాడి శివరామకృష్ణ, సంఘ గౌరవ సలహాదారులు కాండ్రేగుల సత్యనారాయణ, పొన్నా చల్మాజీ, బుద్ధ వీరునాయుడు, కొత్తూర్తి రామారావు, భీశెట్టి శివరామకృష్ణ, కె.పాపయ్య నాయుడు, ఊడా సత్యనారాయణ, మైలపల్లి నూకరాజు, సూరే సుబ్బారావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ జెఎల్‌ఎంల సమస్యలపై వినతి



వినతిపత్రం ఇస్తున్న యుఇఇయు నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సచివాలయాల జేఎల్‌ఎం-2 సమస్యలపైనా, బదిలీలపై ఇచ్చిన గైడ్‌లైన్స్ మార్చాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థ గైడ్‌లైన్స్‌తో జేఎల్‌ఎం-2ల బదిలీలను చేయాలని, రేషలైజేషన్ పద్ధతిని వీరికి వర్తింపజేయాలని, విద్యుత్ సంస్థ ఉద్యోగులుగా పరిగణించి సచివాలయ వ్యవస్థ నుండి వారికి విముక్తి కలిగించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఖాళీ పోస్టుల్లో వీరికి ప్రమోషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు కే.మాధవి, కే.నాగఅప్పారావు, జేఎల్‌ఎం గ్రేడ్-2 లీడర్స్ అప్పలరాజు, శంకర్, అక్కునాయుడు, గంగాధర్, చంద్రరావు సుమారు 20 మంది కార్మికులు పాల్గొన్నారు.

వడ్డాది కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది టైపు-4 కేజీబీవీలో 9, 10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రవేశాలకు బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆసక్తిగల బాలికలు వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న కళను 9492786987 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్ఓ వై.సత్యనారాయణ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఒక్కటే బీసీ మహిళా కళాశాల వసతిగృహం ఉండడం వల్ల అది అందరికీ సరిపోకపోవడంతో చాలామంది విద్యార్థినులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అందువల్ల ఎస్టీ, ఎస్సీ, బీసీ మహిళా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో విద్యార్థుల మెస్ బిల్లుల నుంచే అక్కడ పనిచేసే వంట మనిషి, కమాటి, వాచ్‌మెన్ లాంటి వర్కర్స్‌కు జీతాలు ఇస్తున్నారని, దీంతో విద్యార్థులకు ఇచ్చే మెనూలో కోతలు విధించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వమే ఎస్‌టి హాస్టళ్లలో పని చేసే వర్కర్లకు జీతాలు చెల్లించాలని కోరారు. జిల్లాలోని అన్ని హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు నాయుడు, శివాజీ పాల్గొన్నారు.




సమవేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు లక్ష్మి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలి

ప్రజాశక్తి-బుచ్చయపేట : అర్హులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు సకాలంలో అందజేయాలని మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక విఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూమి యజమాని దగ్గర కౌలు లీజు అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రైతుల నుండి నీటి తీరువాను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ మురళీధర్ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-కశింకోట : టిడిపి కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యాకర్త పెదపాటి వెంకట్రావు ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య సత్యవతికి పార్టీ సంక్షేమ నిధి నుండి రూ.5 లక్షల చెక్కును సోమవారం పీలా గోవింద అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, కాయల మురళి, వేగి గోపికృష్ణ, షేక్ రెహమాన్ (బాబర్), బుదిరెడ్డి అప్పడు పాల్గొన్నారు.



మృతుని భార్యకు చెక్కు అందిస్తున్న పీలా గోవింద తదితరులు

పరవాడ టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిడ్కో కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ ఈ కాలనీలకు చెత్త సేకరణకు బండి రావడం లేదని, దీంతో వీధులన్నీ చెత్తతో నిండిపోయాయని, ఈ చెత్త సమస్య వల్ల దోమలు ఎక్కువై విష జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. టిడ్కో కాలనీలో 2వేల ఇళ్లు ఉన్నాయని, ఇక్కడ రేషన్ డిపో లేకపోవడంతో రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న గొర్లవానిపాలెం వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తోందని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఈ కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. వీధిలైట్లు లేకపోవడం వల్ల రాత్రిపూట దొంగతనాలు జరుగుతున్నాయి, పాములు వస్తున్నాయని, వెంటనే వీధిలైట్లు వేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే పై సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పరవాడ టిడ్కో కాలనీ కమిటీ అధ్యక్షులు బంగారం, కార్యదర్శి అన్నపూర్ణ పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నేతలు మాణిక్యం, బంగారం, అన్నపూర్ణ

వైద్యాధికారి బదిలీతో
పశు వైద్యసేవలు మృగ్యం!

- వ్యాధుల సీజన్‌లో మూగజీవాలకు అందని వైద్యం
- ఆందోళన చెందుతున్న పాడి రైతులు, జీవాల పెంపకందారులు



వడ్డాది పశువుల ఆసుపత్రి

ప్రజాశక్తి -వడ్డాది : మండలంలోని వడ్డాది పశువుల ఆసుపత్రిలో వైద్యసేవలు మృగ్యమయ్యాయని, పాడిరైతులు, జీవాల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి పశువైద్యాధికారిని బదిలీ, రిలీవ్ చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులు, వేరొకరిని నియమించకపోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వైఫల్యం వల్ల పదిరోజులుగా వైద్యసేవలు అందని పరిస్థితి ఉంది. దీంతో మండలంలోని దాదాపు 30 గ్రామాల ప్రజలు అందని పశువైద్యసేవలపై ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని వడ్డాది పశువైద్యాధికారి డాక్టర్ వైద్యశాలలో డాక్టర్ ఉమామహేశ్వరిని ఇటీవల సాధారణ బదిలీల్లో ట్రాన్స్‌ఫర్, రిలీవ్ కావడం చకచకా జరిగిపోయాయి. ఆమె స్థానంలో వేరొకరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం వర్షాలు, జ్వరాల సీజన్‌లో పశువైద్యసేవలు అందని పరిస్థితి ఉంది. దీంతో మండలంలోని శివారు గ్రామమైన మంగళాపురం, కుముందానుపేట విజయరామరాజుపేట వడ్డాది, బంగారుమెట్ట, ఎల్జీపురం, లోపూడి సింగవరం, పొట్టిదొరపాలెం, కోమల్లపూడి, బుదిరెడ్డిపాలెం, గంటి కోర్లం తదితర ఇరవై గ్రామాల్లో పాడిరైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు వైద్యసేవలు అందకపోవడంపై ఆందోళన చెందుతున్నారు.

వైద్యాధికారిని బదిలీ, రిలీవ్ చేసిన పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారులు, వేరే డాక్టర్‌ను వెంటనే నియమించి, మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో దూడలు, మేకలు గొర్రెలపై కుక్కల దాడులు ఎక్కువై, గాయాలపాలైన వాటిని ఆసుపత్రికి తీసుకొస్తే అత్యవసర చికిత్సలు అందే పరిస్థితి లేకుండా పోయిందని పెంపకందారులు వాపోతున్నారు. వెటర్నరీ అసిస్టెంట్‌తో పశువుల ఆసుపత్రిని నిర్వహణతో కాలం వెళ్లదీస్తున్న అధికారులు వెంటనే స్పందించాలని, మూగజీవాలకు వైద్యసేవలకు ఇబ్బందులు లేకుండా వైద్యాధికారిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



మోడల్ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులు

మోడల్ పాఠశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పిండ్రంగిలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భారీగా చేరుతున్నారని, ఇప్పటికే 62 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని మండల విద్యాశాఖ అధికారులు కె.సత్యనారాయణ డివిడి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలను, పాఠశాల ప్రాంగణాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో విద్యా విధానం ప్రత్యేక పద్ధతిలో ఉంటుందని, విద్యార్థులు సులువుగా నేర్చుకొనే విధంగా బోధన సాగుతుందని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో అత్యధికంగా ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి, ఎంపిటిసి సభ్యుడు ఎన్.గోపి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు బంగారునాయుడు, నాయుడుబాబు, రమేష్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం డి-2 సెక్షన్, 33/11కెవి అంతకపల్లి సబ్ స్టేషన్ పరిధిలో అడిషనల్ బ్రేకర్ స్కీమ్ పనులు కారణంగా ఈనెల 25న బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతకపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోధువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపురఅగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, నాయనమ్మపాలెం, లగిశెట్టిపాలెం, గాలి భీమవరం, వినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



యలమల రామకృష్ణుడును సత్కరిస్తున్న బుచ్చిరాజు తదితరులు

యనమలను కలిసిన బుచ్చిరాజు

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనముల రామకృష్ణుడిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) డైరెక్టర్‌గా నూతనంగా ఎంపికైన పివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) తునిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమలకు పుష్పగుచ్ఛం ఇచ్చి సాలువాతో సత్కరించారు. ఆయన వెంట గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, సబ్బవరం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాస్ తదితరులున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : కొద్ది రోజులుగా వాతావరణం చల్లబడి, కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మెట్ట భూములను రైతులు దుక్కులు చేసుకొని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. సోమవారం ఓ మోస్తరు వర్షం కురవడంతో మండలంలోని బుచ్చెయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో రైతులు గంటి నాట్లు వేశారు.



గంటి నాట్లు వేస్తున్న రైతులు

గ్రావెల్‌తో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన



గ్రావెల్‌తో రోడ్డు గుంతలు పూడ్చుతున్న దృశ్యం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం-రేఖవానిపాలెం రహదారిలో గొల్లగరువు వద్ద ఏర్పడిన భారీ గోతులను స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ చొరవతో సోమవారం గ్రావెల్‌తో పూడ్చారు. బొట్టవానిపాలెం-రేఖవానిపాలెం మార్గంలో రహదారి శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనంపై ఇటీవల ప్రజాశక్తి కథనం ప్రచురించింది. గొల్లగరువు సమీపంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారి చెరువును తలపిస్తున్న విషయాన్ని, వాహనదారులు, ప్రయాణికులు నానా తంటాలు పడుతున్న పరిస్థితిని తెలియజేసింది. దీనికి స్పందించిన స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పరిశీలించారు. అక్కడ రహదారిపై వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండే విధంగా గ్రావెల్, క్రషర్ డస్ట్ పోసి జెసిబి సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రహదారి బిటి రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సబ్ ట్రెజరీ ఆఫీసర్ జోగారావును సత్కరిస్తున్న దృశ్యం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా సబ్ ట్రెజరీ ఆఫీసర్ జోగారావుకు రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా నూతనంగా నియమితులైన వివి.జోగారావును సోమవారం కాశీ విశ్వేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలను ఎస్‌టిఓ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతినెల ఆరోగ్య బీమా చెల్లించే కొంతమంది పెన్షనర్ల భార్యాభర్తల ఇద్దరు పేరునా వసూలు చేస్తున్నారని, తక్షణం భార్య పేరుతో ఉన్న బీమాను తొలగించాలని కోరారు. ఇద్దరు దగ్గర ఆరోగ్య బీమా వసూలు చేస్తున్నారని, ఒక్కరికి మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని జోగారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, ఎస్.మన్మధరావు, జోగారావు, యల్లపు శ్రీరాములు, కే చంటిబాబు, కే సర్వేశ్వరరావు, గణపతి, శరగడం నూకరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'యువతను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం'

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలో యువతను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లే అనురాధ విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం తారువలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు కల్పిస్తామని, లేకుంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి సర్కార్ ఏడాది పాలన పూర్తయిన అమలు చేయకపోవడం యువతను మోసగించడమేనని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారని మండిపడ్డారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు అందిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చెర్ల గ్రామ పంచాయతీలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చెర్ల గ్రామ టిడిపి అధ్యక్షులు నైనమశెట్టి రమణరావు, కూటమి నాయకులు నిమ్మదల సన్యాసి నాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, గుడబండి జాన్, భీమవరపు శ్రీను, నైనంశెట్టి భూషణ్, నిమ్మదల సూరి అప్పలరాజు, నిమ్మదల నాగేశ్వరరావు (బుజ్జి) కూటమి నాయకులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం లోపూడి రైతు సేవా కేంద్రం వద్ద వరి విత్తనాలను రైతులకు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దొండా శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సకాలంలో వరి నాట్లు వేయటానికి ముందుగా వరి విత్తనాలను ఆర్‌ఎస్‌కెల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. లోపూడి, ఎల్.సింగవరం, బంగారు మెట్ట, ఎల్బి అగ్రహారం గ్రామ రైతులకు సకాలంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు సాయం శేషు, ఎంపీటీసీ ఎల్లపు జగ్గారావు, రైతు సేవ మిత్ర బ్లెస్సి, రైతులు తమరాన సోమునాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు



లోపూడిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులకు బదిలీల్లో మైదాన ప్రాంతాలలో ఖాళీలను చూపించి వారికి న్యాయం చేయాలని డీఈఓ అప్పారావు నాయుడుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సు రీత్యా ఏజెన్సీలో పనిచేయడం కష్టతరం అవుతున్న నేపథ్యంలో వారికి మైదాన ప్రాంతాల్లోనే ఖాళీలను చూపించాలని కోరారు. ఎస్ఎస్‌సి మూల్యాంకన రుసుమును వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు, ఉపాధ్యక్షులు ఎం.వి.లోకేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు మత్స్యకారుల ఆందోళన

పరిహారం చెల్లించాలని

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీకు లీజుకు ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించకపోవడం చట్ట విరుద్ధమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. పరిహారం చెల్లించాలని కోరుతూ మత్స్యకారులు తలపెట్టిన ధర్నా సోమవారం నాటికి 5వ రోజుకు చేరింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు తరలి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. పరిహారం చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, భూములకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు రహదారి నిర్మాణ పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మత్స్యకారులకు పరిహారం చెల్లించకపోవడం చాలా బాధాకరమన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మహిళలు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, మత్స్యకారులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగుంపేట గ్రామంలో సోమవారం గొలుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యాంకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్‌విఎస్.ప్రసాద్, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని కొంగసింగి రామాలయం వద్ద సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో విశాఖ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖపట్నం కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులచే పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 23 మంది ఆపరేషన్లకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

- అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి- పాయకరావుపేట:తల్లికి వందనం తమకు వర్తింపచేయాలని అంగన్వాడీ టీచర్లు ఎంపిడివో కార్యాలయంలో ఏఓ, పి.ఎచ్.ఆర్. కె.వర్మ, డిప్యూటీ ఎంపీడిఓ కుంచా డేవిడ్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు బత్తిన నాగేశ్వరావు, అంగన్వాడీ టీచర్లు తులసి, విజయమ్మ, సునీత, శ్యామల కుమారి, వరలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

వైసిపి గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు సోమవారం గొలుగొండ మండలం రావణాపల్లి వైసీపీ గ్రామ అనుబంధ కమిటీలను మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ యువజన విభాగం అధ్యక్షులుగా కొల్లు శ్రీనివాస్, గ్రామ మహిళా విభాగం అధ్యక్షులుగా రాజాన నూకరత్నం, గ్రామ రైతు విభాగం అధ్యక్షులుగా కొల్లు రాము, గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొల్లు బైరాగి, అనుబంధ కమిటీల ఉపాధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను, కార్యదర్శులను, మెంబర్లను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని సీహెచ్.నాగాపురం వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా గొంతిన సూరిబాబు ఎన్నికయ్యారు. సోమవారం పార్టీ సీనియర్ నేతలు బుల్లి ప్రసాదు, సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు ఆధ్వర్యంలో ఈ కమిటీల ఎంపిక ఏకగ్రీవంగా సాగింది. అధ్యక్షునిగా గొంతిన సూరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా బాలం సీతమ్మ నాయుడు, మొల్లా జీవన్ కుమార్, గాజుల లోవరాజు, జైతు సింహాచలం ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పల్లా చిన అప్పారావు, జైతు రమణ, అప్పన కృష్ణ, జుర్రా శివ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన గ్రామ కమిటీ

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కోటవురట్ల:స్థానిక తహసిల్దార్ కార్యాల యంలో సోమవారం పలువురు అధికారులు బదిలీలు అయ్యారు. రీ సర్వే డిటిగా ఎం వీరభద్రాచారి బాధ్యతలు చేపట్టారు. ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన డి.కృష్ణ చీడికాడ ఆర్ఐ గా బదిలీపై వెళ్లారు. మండల ఆర్ఐ గా ఎస్ఏఎస్ మణికంఠ రాయవరం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన ఉర్ధవరావు రాయవరం బదిలీపై వెళ్లారు.



బాధ్యతలు స్వీకరించిన రీ సర్వే డీటి వీరభద్రాచారి



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు, జెసిబి


అక్రమంగా గ్రావెల్, మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురం బోయినవారి చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీనీ పోలీస్‌స్టేషన్‌కు తరలిం చినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలి పారు. ఈ చెరువులో గత రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఈ ప్రాంతానికి వెళ్లి పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో జేసీబీ, నాలుగు ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహశీల్దార్‌కు పంపించామని చెప్పారు.

నక్కపల్లి: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. సోమవారం సాయంత్రం లారీలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా ఉపమాకలో పట్టుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్య నిమిత్తం కేసును తహసిల్దార్ కు అప్పగించినట్లు తెలిపారు.

టిడిపి అరకు ఎన్నికల పరిశీలకులుగా పుప్పాల

ప్రజాశక్తి-మాడుగుల:అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా మాడుగుల గ్రామానికి చెందిన మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజును ఎంపిక చేశారు. టీడీపీ సీనియర్ నాయకులైన అప్పలరాజు గతంలో మాడుగుల టిడిపి పట్టణ అధ్యక్షులుగా, మండల అధ్యక్షులుగా, ఎంపీపీగా, సిడిసి చైర్మన్గా, టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నో పదవులు చేపట్టి నేడు అరకు టిడిపి పరిశీలకులుగా నియమితులు కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు.



కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సమస్యలను పరిష్కరించాలని ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 5వ రోజుకు చేరింది. సబ్ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు నిరసన దీక్ష విరమించబోమని హెచ్చరించారు. అత్యవసర సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. పదేళ్ల సర్వీసు పైబడిన వారిని క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పలనాయుడు, మహేష్, ప్రకాష్ తపాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న కార్మికులు

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-పాడేరు:సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ సంస్థ ఉద్యోగులకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి జిల్లాలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్, డిఆర్‌ఓకి వినతి పత్రాలను ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అందజేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్స్ గ్రేట్ బి2 జేఎల్‌ఎంలకు విద్యుత్ సంస్థ గైడ్లైన్స్ ద్వారా బదిలీలు చేపట్టాలని, రేషనలైజేషన్ పద్ధతి వీరికి వర్తింప చేయాలని కోరారు. ు, సిఐటియు నాయకులు సుందర్ పాల్గొన్నారు.

బస్ ప్రమాదంపై స్పీకర్ ఆరా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం నుండి విశాఖపట్నం వెళ్తున్న నర్సీపట్నంకు చెందిన ఆర్టీసీ నాన్ స్టాప్ బస్సు కసింకోట వద్ద సోమవారం లారీని ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తో మాట్లాడి ప్రమాద స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి తగిన వైద్య సేవలు వెంటనే అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పౌష్టికాహారం అందించకుంటే చర్యలు

ప్రజాశక్తి-అనంతగిరి:మాతా శిశు మరణాలు అరికట్టేం దుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేస్తున్న పౌష్టకాహారం లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసిడిఎస్ అల్లూరి సీతారామరాజు జిల్లా పీడి ఝాన్సీ లక్ష్మీబాయి హెచ్చరించారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ, ఎగువ శోభ పంచాయతీ పరిధి మర్దగూడ అంగన్వాడి కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అంగన్వాడి కేంద్రాలు పనితీరు, లబ్ధిదారులకు పౌష్టికాహారం. మిల్క్ పౌడర్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆహార పదార్థాలను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న వీధి విక్రయదారులు

వీధి విక్రయదారుల సమస్యలు పరిష్కరించాలి

- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:వీధి విక్రయదారుల హక్కులను కాపాడుతూ, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా కో కన్వీనర్ భీంపల్లి రాము మాట్లాడుతూ, వీధి విక్రయదారుల సంక్షేమం కోసం విడుదల అయిన జీవోలను, మెమోలను జివిఎంసిలో అధికారులు తారుమారు చేశారని ఆరోపించారు. 2013 నుంచి 2025 వరకు ఆర్థికపరమైన అవినీతికి పాల్పడిన ఈ అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణం న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నోట్ 37 రూల్స్ 4/2 ప్రకారం జివిఎంసి పరిధిలోని 8 జోన్లలో టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులను బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాలన్నారు.మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఫుడ్ కోర్ట్ లో 2018 నుంచి ఇంతవరకు జివిఎంసి అధికారులు పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని దీనిపై దర్యాప్తు జరిపించాలన్నారు. బినామీ పేర్లతో నడుస్తున్న ఫుడ్ కోర్ట్ దుకాణాలను నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు కే సత్యనారాయణ, ఫెడరేషన్ జిల్లా నాయకులు శ్రీను, కె.ప్రియ, గ్రంధి శ్రీనివాసరావు, నందిని శ్రీను, జక్కన్న నరసింహామూర్తి, సుంకర నాగేశ్వరరావు, పి. చిరంజీవి రావు, ఈశ్వరమ్మ, బాబ్జి పాల్గొన్నారు.

చిన్నపిల్లల వైద్యాధికారిణిగా నీలవేణి

ప్రజాశక్తి-చింతపల్లి:రాష్ట్ర ప్రభుత్వ సాధారణ బదిలీలలో భాగంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి చిన్నపిల్లల వైద్య నిపుణురాలిగా ఎం.నీలవేణి నియమితులయ్యారు. ఇప్పటివరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించిన ఆమె తాజాగా చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించారు.

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ



విశాఖలో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 383 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 115 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 28, జివిఎంసికు సంబంధించి 94 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 146 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, డిప్యూటీ కలెక్టర్లు శేషశైలజ,వ ుధుసూదన్‌రావు, చీఫ్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాలలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారులు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవచ్చని, అదేవిధంగా ఏమైనా సందేహాలు ఉంటే అడగవచ్చని, కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చని డిఆర్ఒ భవానీ శంకర్ తెలిపారు. పిజిఆర్ఎస్‌లో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసిలో 77 వినతులు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 77 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు డివి.రమణమూర్తితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

నక్కపల్లి:నక్కపల్లి మండలం అమలాపురం గ్రామం లో శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీకు ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో సొసైటీ కి చెందిన మత్స్యకారులు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో డిఆర్ఓ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేసి, సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు,మత్స్యకారులు మాట్లాడుతూ, శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ కు 1994 సంవత్సరంలో వేంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 410/4లో 16 ఎకరాల 65 సెంట్లు, 417లో 11 ఎకరాల 50 సెంట్లు, 418 లో 15 ఎకరాలు మొత్తం 43 ఎకరాల 15 సెంట్లు భూమిని లీజుకు ఇవ్వడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు ఆ భూముల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు ఆ భూములు తప్ప వేరే ఆధారం ఏమీ లేదన్నారు.వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం పరిశ్రమల స్థాపనకు తమకు లీజికిచ్చిన భూములను కూడా సేకరించి, బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. భూములకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా, పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 2016 లో రైతులు,మత్స్యకారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మత్స్యకార సొసైటీ భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. వెంటనే పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మత్స్యకారులు పాల్గొన్నారు.

అనకాపల్లి పిజిఆర్ఎస్‌కు 256 అర్జీలు

అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుండి 256 అర్జీలు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామమణి, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాలరాజు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని డిఆర్ఒ సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావునాయుడు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 30 ఫిర్యాదులు

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 30 ఫిర్యాదులు స్వీకరించారు. అందులో ఆస్తి వివాదాలు, కుటుంబ సంబంధిత కలహాలు, మోసపూరిత సంఘటనలు వంటి ఫిర్యాదులున్నాయి. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు ఈ ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఒక్క ఫిర్యాదుని సానుకూలంగా విని, సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేసి, చట్టపరమైన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్పై డి.వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

విశాఖ కలెక్టరేట్:విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల అధ్వర్యంలో డిఆర్‌వో బిహెచ్ భవానీ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌వోను జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్‌లు కలుసుకొని ఇప్పటికే ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలు అక్కడ జర్నలిస్టుల పిల్లలకు స్కూల్‌లో ఫీజు రాయితీపై ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని వివరించారు.అలాగే వినతిపత్రంతో పాటు ఆయా జిల్లాలు జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను డిఆర్‌వోకి అందజేశారు.అక్కడి మాదిరిగానే విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొన్ని స్కూల్స్ ఫీజు రాయితీ నిరాకరిస్తున్నాయని తెలిపారు.జర్నలిస్టుల వినతిపై డిఆర్‌వో సానుకూలంగా స్పందించారు. ఆయా ఉత్తర్వులు పరిశీలించి తక్షణమే జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపాలని డిఈవో ప్రేమ్ కుమార్‌కు సూచించారు.

జర్నలిస్టులకు గతేడాది మాదిరిగానే ఉచితంగా వైద్య పరీక్షలు చేయించాలని కోరగా, ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు,బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్,ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బండారు శివప్రసాద్,త్రినాథరావు, ,పిల్లా నగేష్ బాబు, పి.కామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి సంగతేంటి?

ఉమ్మడి విశాఖలో వైసిపి 'యువత పోరు' నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంవత్సర కాలంగా ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందంటూ వైసిపి ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యువత, వైసిపి నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమం జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. నిరసన ర్యాలీని మధ్యలో పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని నెట్టుకుంటూ నిరసనకారులు ర్యాలీని కొనసాగించి కలెక్టరేట్‌లో డిఆర్ఒకు వినతి పత్రం సమర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉరుకూటి చందు నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంట ున్నారన్నారు. కొత్త ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవగా ఉన్న ఉద్యోగాలు తీసివేస్తూ లక్షల మంది పొట్ట కొడుతోందని విమర్శించారు. షెడ్యూల్ ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు స్వస్తి పలికారంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ ప్రసాద్, తైనాల విజయ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య, నియోజవర్గ సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, ఆధికార ప్రతినిధి మహ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

యువతను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం



అనకాపల్లిలో పాల్గొన్న అమర్‌నాథ్, నాయకులు

అనకాపల్లి : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి వారిని మోసగించిందని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. యువత పోరు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వైసిపి కార్యాలయం నుండి యువత, విద్యార్థుల నాయకులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించలేదన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. నిరుద్యోగ యువతకు రూ.3వేలు భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో పలు శాఖలలో ఉన్న ఉద్యోగుల తొలగింపు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్లమెంటరీ పరిశీలకురాలు శోభ హైమావతి, అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, పైల శ్రీనివాసరావు, పలిశెట్టి సురేష్, మలసాల కుమార్ రాజా, పొల్లేటి వెంకటేష్, హేమంత్, వేగి త్రినాథ్, బాదం హరి, పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.